నేటి నుంచి రాజధానికి ఎలక్ట్రిక్ బస్సులు



- అంబేద్కర్ స్టేడియంలో ప్రారంభోత్సవం
- ముగ్గురు మంత్రులు, ఆర్టీసీ ఎండీ రాక
- జిల్లాకు చేరిన 35 ఎలక్ట్రిక్ బస్సులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభిస్తున్నది. రాష్ట్రంలోని ఆరు ఆర్టీసీ డిపోల నుంచి ఎలక్ట్రిక్ బస్సులను నడిపించాలని నిర్ణయించగా అందులో కరీంనగర్-2 డిపో కూడా ఉంది. ఆదివారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు ఎలక్ట్రిక్ బస్సుల ప్రయాణానికి శ్రీకారం చుట్టనున్నారు. అంబేద్కర్ స్టేడియంలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ బస్సులను దశలవారిగా విస్తరించాలని ఆర్టీసీ భావిస్తున్నది.

జేబీఎస్ వరకు రోజుకు 66 ట్రిప్పులు

కరీంనగర్ రీజియన్‌కు 70 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించారు. ఇందులో తొలివిడతగా 35 సూపర్ లగ్జరీ బస్సులను జిల్లాకు సమకూర్చారు. రెండు బస్సులను స్పేర్‌లో ఉంచి 33 బస్సులను కరీంనగర్-హైదరాబాద్ రూట్‌లో కరీంనగర్ నుంచి జేబీఎస్ వరకు రోజుకు ఒక్కో బస్సు రెండు ట్రిప్పుల చొప్పున 66 ట్రిప్పులు నడిపిస్తారు. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు (జీసీసీ) పద్ధతిలో అద్దె ప్రాతిపదికన ఈ బస్సులను నడిపిస్తున్నారు. వీటి పర్యవేక్షణ ఆపరేషన్స్ మొత్తం ఆర్టీసీనే చూసుకుంటుంది. కరీంనగర్-2 డిపోలో ఎలక్ట్రిక్ బస్సులను ఉంచి నడిపించనున్నారు. ఇందుకు అవసరమైన మౌలిక వసతులతోపాటు చార్జింగ్ కేంద్రా లను ఏర్పాటు చేశారు. కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు 33 ఎలక్ట్రిక్ బస్సులను ప్రస్తుతం నడపనుండగా 70 బస్సులు వచ్చిన తర్వాత జేబీఎస్ వరకు మరో ఆరు బస్సులను, కరీంనగర్ నుంచి గోదావరిఖనికి తొమ్మిది, కరీంనగర్ నుంచి మంథనికి నాలుగు, కరీంనగర్ నుంచి కామారెడ్డికి, జగిత్యాలకు ఆరేసి బస్సులను నడిపిస్తారు. కరీంనగర్ నుంచి సిరిసిల్లకు నాన్ స్టాప్ బస్సులుగా ఆరింటిని నడిపించాలని ఆర్టీసీ నిర్ణయించింది.

ఆర్టీసీ కరీంనగర్-2 డిపోతో పాటు నిజామాబాద్, వరంగల్, నల్గొండ, సూర్యాపేట, హైదరాబాద్ టూ డిపోల నుంచి ఎలక్ట్రిక్ బస్సులను నడపనున్నారు. వీటిలో టైప్-3 ఎలక్ట్రిక్ బస్సులతోపాటు నాన్ ఏసీ ఇంటర్ సిటీ బస్సులు కూడా ఉంటాయి. కరీంనగర్-2 డిపోలో 11కెవి విద్యుత్ లైన్లను వేసి 14 చార్జింగ్ పాయింట్లను నెలకొల్పారు. మూడు ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు.

చార్జీ రూ. 330

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రారంభించనున్న ఎలక్ట్రిక్ బస్సులకు గ్రీన్ సెస్సు కింద అదనపు చార్జీలు వసూలు చేయనున్నారు. కరీంనగర్-2 డిపోలో ఆదివారం నుంచి జేబీఎస్‌కు 66 ట్రిప్పులు నడిపించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎలక్ట్రికల్ బస్సుల్లో గ్రీన్ సెస్ కింద మరో 20 రూపాయలు అదనపు చార్జీ వసూలు చేయనున్నారు. మాములు బస్సులకు కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు 310 రూపాయల చార్జీ ఉంది. ఎలక్ట్రిక్ బస్సుల్లో గ్రీన్ సెస్ 20 రూపాయలు కలుపుకుని 330 రూపాయలు వసూలు చేయనున్నారు.

ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు పాటించాల్సిందే..



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 28: ప్రైవేటు ఆసుపత్రులు తప్పనిసరిగా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధలను పాటించాల్సిందేనని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ (డీఆర్‌ఏ) ఆత్వర్యంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఏ ఛైర్‌పర్సన్, కలెక్టర్ పమేలాసత్పతి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ప్రైవేటు ఆసుపత్రిలో రిసెప్షన్ సెంటర్ వద్ద వైద్య సేవల వివరాలు, చార్జీలు, వైద్యుల వివరాలతో కూడిన నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరోగ్య మహిళ పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కనీస సౌకర్యాలు, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఐదు బెడ్లకంటే ఎక్కువ బెడ్లు ఉన్న ఆసుపత్రులు విధిగా పార్కింగ్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. 50 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలకు అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకోవా లన్నారు. పాత ఆసుపత్రుల నిర్వాహకులు ఆరు నెలల్లోగా పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. బయో మెడికల్ వ్యర్థాలను మున్సిపాలిటీ అందించే వ్యర్థాలతో కలపవద్దని సూచించారు. అన్ని పత్రాలు తీసుకున్న ఆసుపత్రులకు అనుమతులు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌ఏ కన్వీనర్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో శనివారం జిల్లా పాఠశాలల క్రీడా సామాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లాలోని 16 మండలాల నుంచి బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి వి శ్రీనివాస్ పోటీలను ప్రారంభించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను కరీంనగర్ జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో కార్యలయం సూపరింటెండెంట్ ఎన్ ఎన్ స్వామి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్య దర్శి వి వేణుగోపాల్, సెక్టోరియల్ ఆఫీసర్ ఆంజనేయులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో వి శ్రీనివాస్

ఎల్ఎండీ గేట్ల ఎత్తివేత



ఎల్ఎండీ నుంచి దిగువకు ప్రవహిస్తున్న నీరు

తిమ్మాపూర్, సెప్టెంబరు 28: కరీంనగర్ పరిధిలోని ఎల్ఎండీలో ఉన్న నీటికితోడు మిడ్ మానేరు నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోల కారణంగా దిగువ మానేరు జలాశయం పూర్తిస్థాయిలో నిండింది. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ వంశీధర్ రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 24.034 టీఎంసీలకు ప్రస్తుతం పూర్తి స్థాయిలో నిండి 24.034 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి 8,900 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి వస్తోంది. రెండు గేట్లు 1.5 ఫీట్ల మేర ఎత్తి 5,202 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా నాలుగు వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 312 క్యూసెక్కులు, మొత్తం 9,514 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. ఈ నెల 16న రెండు గేట్లు ఎత్తిన అధికారులు ఇన్‌ఫ్లో తగ్గడంతో మూసివేశారు. శనివారం రెండోసారి గేట్లు ఎత్తారు.

వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలు పరిష్కరించాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 28: వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలు పరిష్కరించాలని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మెన్ దారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేను తెలంగాణలో అమలు చేస్తోందన్నారు. ఈ సర్వేతో విస్తరణ అధికారులకు పనిభారం పెరుగుతుందని తెలిపారు. ఇప్పటికే వారు 49 రకాల పనులు నిర్వహిస్తున్నారని, ఉన్న బాధ్యతలకు తోడు కొత్తగా డిజిటల్ సర్వేను వారితో నిర్వహిస్తే ఇబ్బందిపడతారన్నారు. ఈ సర్వేలో ఎదురవుతున్న కష్ట నష్టాలను వివరించారు. అనంతరం మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, తెలంగాణ రాష్ట్ర వెటర్నరీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి గూడ ప్రభాకర్‌రెడ్డి, రాగి శ్రీనివాస్, కిరణ్‌కుమార్, వ్యవసాయ అధికారులు చింతల శ్రీనివాస్, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెప్యాల రాము పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై కేసులు ఎత్తివేయాలి

గణేశ్‌నగర్, సెప్టెంబర్ 28: విద్యారంగ సమస్యల పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లో ఆందోళన చేస్తున్న వారిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రజా పాలన వస్తుంది, జీవితాలు బాగుపడతాయని ఆశించిన విద్యార్థులకు నిరాశే మిగిలిందన్నారు. రాష్ట్రంలో మూడు సంవత్సరాలుగా ఎనిమిది వేల కోట్లకు పైగా విద్యార్థులు రావలసిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. చాలా వరకు ప్రభుత్వ పాఠశాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. కేసులను ఎత్తివేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్‌సాగర్, తిప్పారపు రోహిత్, సహాయ కార్యదర్శి ఇసాక్, బోగేష్, జిల్లా కమిటీ సభ్యులు సందేశ్, ఆకాశ్, రాకేష్, అన్వేష్, కిరణ్, వంశి, రాజుకుమార్, సిద్ధు పాల్గొన్నారు.

- ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో మెయిన్ గేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, శ్రీనివాస్, దీక్షిత్, నవీన్, మల్లేష్, రాకేష్, నరేష్, వంశీ, శివ, ఉదయ్‌కిరణ్, శివకుమార్, కళ్యాణి, శిరీష పాల్గొన్నారు..

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గంగాధర, సెప్టెంబరు 28: మండలంలోని పత్తికుంటకు చెందిన తాళ్ల మల్లయ్య(78) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పత్తికుంటకు చెందిన తాళ్ల మల్లయ్య ఈనెల 27న తన ఇంటి ముందు రోడ్డు దాటుతున్నాడు. మండలంలోని గర్షకుర్తికి చెందిన ద్విచక్రవాహనదారుడు అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ మల్లయ్య ను ఢీ కొట్టాడు. బాధితుడు కరీంనగర్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడు మల్లయ్య కుమారుడు రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

డిగ్రీలో ప్రవేశాలకు రేపు తుది గడువు

హుజూరాబాద్, సెప్టెంబరు 28: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశ పొందడానికి సోమవారంతో గడువు ముగియనుందని హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రంలో చదువాలనుకునే విద్యార్థులు 050 కోడ్‌ను ఎంపిక చేసుకోవాలని సూచించారు. సమాచారం కోసం అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు.

భార్య చేతిలో భర్త హతం

మానకొండూర్, సెప్టెంబరు 28: మానకొండూర్‌లో భార్య చేతిలో ఓ భర్త మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌లోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మోటం సమ్మక్క- మోటం పోచయ్య (50) దంపతులకు కూతురు ఉంది. కూతురుకు వివాహం చేశాడు. దంపతులు పాత సామాను వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. కొంత కాలంగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. విసిగిపోయిన సమ్మక్క శుక్రవారం రాత్రి ఇంటి ఆవరణలో రోకలి బండతో తలపై కొట్టడంతో పోచయ్య తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమ్మక్కపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామి తెలిపారు.

అడవి పందుల దాడిలో వరి పంట ధ్వంసం

- ఆందోళనలో అన్నదాతలు

కోనరావుపేట, సెప్టెంబరు 28: కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామ శివారులో అడవి పందుల దాడిలో వరి పంట ధ్వంసమైంది. మామిడిపల్లికి చెందిన మోకిడి శ్రీనివాస్ అనే రైతుకు చెందిన వరి పొలంను అడవి పందులు ధ్వంసం చేశాయి. కోతకు వచ్చే సమయంలో వరి పంటను ధ్వంసం చేశాయని బాధిత రైతు తెలిపారు. పంటలపై అడవి జంతువులు దాడి చేస్తుండడంతో చేతికి వచ్చే పంటలు కోల్పోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు నష్టపరిహారం అందజేయాలని బాధిత రైతు కోరాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 28: మండల కేంద్రంలోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన బాలయ్య తన ద్విచక్రవాహనంపై బస్టాండ్ వైపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లి వైపునకు వెళ్తున్న ఎల్లయ్య బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బాలయ్య, ఎల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కోట్లకు వ్యాపారి ఐపీ

వేములవాడ, సెప్టెంబరు 28: వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ ప్రాంతంలో గల ఓ వ్యాపారి రెండు కోట్ల రూపాయలకు ఐపీ దాఖలు చేసి తనకు అప్పు ఇచ్చిన వారికి నోటీసులు పంపించాడు. చందుర్తి మండలానికి చెందిన సదరు వ్యాపారి సుమారు 10 ఏళ్ల క్రితం వేములవాడకు వచ్చి స్థిరపడ్డాడు. కులవృత్తితో జీవనోపాధి ప్రారంభించి ఆ తర్వాత వ్యాపారం కొనసాగించాడు. నెల రోజుల నుంచి కనిపించకుండా పోయాడు. సుమారు కోటీ 36 లక్షల రూపాయలను తాను బాకీ ఉన్నట్లుగా ఐపీ దాఖలు చేస్తూ నోటీసులు పంపించాడు.

సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరవ్వాలి

తిమ్మాపూర్, సెప్టెంబరు 28: ప్రభుత్వ జిల్లా విద్యా విక్షణా సంస్థ (డైట్)లో రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్‌ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్‌ఈ) మొదటి సంవత్సరంలో చేరేందుకు నిర్వహించిన డీఈఈసెట్-2024 ఫలితాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ శ్రీరాంమొండయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణులైన పాత కరీంనగర్ జిల్లాకు చెందిన అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువ పత్రాలను గత నెల పరిశీలించామని పేర్కొన్నారు. అని వార్య కారణాల వల్ల ధ్రువపత్రాలు పరిశీలనకు హాజరు కాని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అక్టోబరు 1న డీఈఈసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఎసెస్సీ, ఇంటర్ మెమోలు, స్టడీ, కుల, ఆదాయ (2024) ధ్రువ పత్రాలు ఒరిజినల్స్ తీసుకొని ఎల్ఎండీ కాలనీలో గల డైట్ కళాశాలలో హాజరు కావాలని సూచించారు. వివరాలకు డీఈఈసెట్-2024 వెబ్‌సైట్‌ను పరిశీలించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

న్యూస్ బాక్స్

దిగువకు విడుదలవుతున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి దిగువ గోదావరిలోకి శనివారం వరద నీరు విడుదల కావడం కొన సాగింది. ప్రాజెక్టు తొమ్మిది వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 28,116 క్యూ సెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 56,206 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరు తోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 56,206 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

తల్లిదండ్రులను విస్మరించే పిల్లలు శిక్షార్హులే

జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ గౌడ్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 28: వయోవృద్ధులైన కన్న తల్లితండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదేనని వారిని విస్మరి స్తే చట్టపరమైన చర్యలు తప్పవని జగిత్యాల డివిజనల్ ఆర్డీవో, వయోవృద్ధుల ట్రిబ్యునల్ ఛైర్మెన్ మధు సూధన్ హెచ్చరించారు. ఆర్డీవో కార్యాల య ఛాంబర్‌లో వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద దాఖలు అయిన కేసుల్లో కొడుకులు, కోడళ్లు, కూతర్లను ఆర్డీవో ఎదుట విచారణకు హాజరయ్యారు. ఈ సం దర్భంగా రాయికల్ మండలం అయోధ్య, పట్టణంలోని స్థానిక పోచమ్మ వాడ, గొల్లపెల్లి మండలం వెన్గుమట్ల చెందిన ఫిర్యాదులపై విచారణ జరిపారు. కొడుకులు, కోడళ్లకు ఆర్డీవో కౌన్సిలింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏవో తఫజుల్ హుస్సేన్, సీనియర్ సిటిజన్స్ జిల్లా కమిటీ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, ప్రతినిధులు గౌరిశెట్టి విశ్వ నాథం, వెల్మల ప్రకాష్‌రావు, సీనియర్ సహా యకులు పద్మజ తదితరులున్నారు.



బస్సు రాని గ్రామాలు...

మండలంలో చాలా వరకు మారుమూల పల్లెలే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రం, సమీప గ్రామాలకు వెళ్లాల్సిందే. మండలంలోని ఏఎస్సార్‌తండా, కేసీఆర్‌తండా, పాటిమీద తండా గ్రామాలకు నేటి వరకు ఒక్కసారి కూడా పల్లెవెలుగు బస్సు నడవలేదు. కోంఢ్రికర్ల, కోనరావుపేట, మెట్లచిట్టాపూర్, బండలింగాపూర్, పెద్దాపూర్, సత్తక్కపల్లి, రాజేశ్వర్ రావుపేట, రామారావుపల్లె, రంగరావు పేట గ్రామాలకు ఉదయం, సాయంత్రం ఒక్కసారి మాత్రమే వస్తున్నాయి.

పల్లె వెలుగు చూడని గ్రామాలెన్నో..

● ప్రజలకు తప్పని ప్రయాణ తిప్పలు ● మహాలక్ష్మి పొందని మహిళలు



ఏఎస్సార్‌తండా శివారులో బస్సు కోసం పడిగాపులు కాస్తున్న మహిళలు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 23 : మెట్‌పల్లి ఆర్టీసీ డిపో పరిధిలోని మండలంలో నూతనంగా ఏర్పడిన కొన్ని గ్రామపంచాయతీలతో పాటు మరి కొన్ని ఆవాస గ్రామాల్లో పల్లె వెలుగు బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్సులు రాకపోవడంతో విద్యార్థులు, మహిళలు కాలినడకన ప్రైవేటు వాహనాల్లో వెళ్లా ల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇటీవల రహదారులు ధ్వంసం కావడం, రూట్లు లాభదా యకంగా లేవన్న కారణాలతో చాలా గ్రామాలకు బస్సులను రద్దు చేసింది. దీంతో పలు గ్రామీణ ప్రాంతాలకు పల్లె వెలుగు బస్సులు దూరమయ్యాయి. తప్పని పరి స్థితిల్లో ప్రజలు, విద్యార్థులు ఎక్కువ చార్జీలు చెల్లించి ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోం ది. ఆటోలు, జీపుల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కడంతో ప్రమాదాలు కూడా జరిగిన ఘటనలు ఉన్నాయి. కొన్ని గ్రామాలకు పల్లెవెలుగు అసలే రాకపోగా మరికొన్ని గ్రామాల్లో ఉదయం, సాయం త్రం ఒక్కసారి మాత్రమే వెళుతు న్నాయి. పల్లె వెలుగు బస్సులను గ్రామాలకు నడపక పోవడంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌ కర్యానికి మహిళలంతా దూరమవుతున్నా రు. తమ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిం చాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్సు రద్దు చేసి పదేళ్ల పైన అవుతుంది

గూగ్లవతు రాములు, ఏఎస్సార్‌తండా వాసి



తెలంగాణ రాక ముందు మా గ్రామం మీదుగా భీమ్‌గల్ అప్పుడప్పుడు బస్సు నడిపేవారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బస్సును నిలిపి వేసినా రంటే నేటికి బస్సు నడవలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినప్పటికీ తమ గ్రామానికి బస్స రాక ఉచిత ప్రయాణం మా ఊరి మహిళలకు అందడం లేదు. వేరే ఊరికి వెళ్లాలంటే మా ఊరి నుంచి కాలినడక ఊరి చివరన రోడ్డు మీదకు వచ్చి ఆటోలు, ద్విచక్ర వా హనాలపై వెళ్లాల్సి వస్తుంది.

విద్యార్థినులు పోటీ పరీక్షలకు సన్నద్ధమవ్వాలి

రాష్ట్ర కళాశాల విద్యాశాఖ ఆర్‌జేడీ రాజేంద్రసింగ్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 28: డిగ్రీతో పాటు విద్యార్థినులు ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతూ, ఆధునిక కాలానికి అనుగుణ మైన నైపుణ్యాలను పెంపొం దించుకోవాలని, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ ఆర్‌జేడీ రాజేంద్ర సింగ్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఆర్‌జేడీ రాజేంద్రసింగ్ పరిశీలిం చారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు, విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్‌ఫేర్, యువజనోత్సవంలో గెలుపొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి బహుమతులు అందజేశారు. కళాశాలలో సదుపాయాలు, సమస్యలను చర్చించి త్వరలో విద్యార్థులకు అవసరమైన అదనపు హాస్టల్ వసతిని కూడా సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అలాగే పీఎం ఉషా నిధులతో త్వరగా అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రయ్య, అడాకమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్, అధ్యాపకులు వాసవి, రహీమ్, శ్రీలత, రాంచందర్, జమున, సునీత, జ్యోత్స్న విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్ర సింగ్

పట్టుకున్న డ్రగ్స్, గంజాయి దహనం



పట్టుబడిన డ్రగ్స్, గంజాయి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 28: జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన 43 కేసులలో నిందితుల నుంచి సీజ్ చేసిన 106 కిలోల నిషేధిత గంజాయిని శనివారం దహనం చేశారు. ఎన్‌డీపీఎస్ చట్ట ప్రకారం జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ కాలుష్య నియంత్ర నిబంధన పాటిస్తూ దహనం చేశామని జిల్లా డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అదనపు ఎస్పీ భీంరావు, ఎస్‌బీ డీఎస్పీ రవీంద్ర కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.





నరసింహుడి దర్శనం చేసుకుంటున్న భక్తులు, స్వామి దర్శనం కోసం క్యూలో భక్తులు

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, సెప్టెంబరు 28: ధర్మపురి క్షేత్రంలో భాద్రపద మాసం ఏకాదశి శని వారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో లక్ష్మీ నర సింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసా చార్యులు, అర్చకులు స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, సప్త హార తులు జరిపారు. గోదావరిలో స్నానాలు చేసిన భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేసి అభిషేకం, కుంకుమార్చన జరి పించారు. ఆల యం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెం డెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపారాయ ణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, అభిషేక్ పౌరోహి తులు బొజ్జ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల హామీలను నెరవేర్చాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 28: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆల్‌ఇండియా ఫార్వర్డ్ రాష్ట్ర కౌన్సిల్ సమా వేశంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి సంతాపం ప్రకటించి పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల విభజన అసంబద్ధంగా, అ శాస్త్రీయంగా జరిగిందన్నారు. కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టో హామీ లను అమలు చేయాలని అక్టోబర్ 21 నుంచి ఆజాద్‌హింద్ దివస్ నుంచి పార్టీ కార్యాచరణ చేపట్టాలన్నారు. రైతుల రుణ మాఫీ అసంపూ ర్తిగా సాగుతోందన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫిరాయింపులు రాహుల్‌గాంధీ ఆశయాలకు, ఇండియా బ్లాక్ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఉందన్నారు. న్యాయవాది కామ్రేడ్ ఎంజావేద్ లతీఫ్‌ను పార్టీరాష్ట్ర ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో కరీంనగర్ నుంచి బండారి శేఖర్, సత్యారావు, అజి త్, ప్రశాంత్ కుమార్, విజయ్‌కుమార్, బద్రి నేత, రాజశేఖర్‌గౌడ్, సూర్యకిరణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.



ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొన్న నాయకులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జైపూర్, సెప్టెంబరు 28:మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని ఇందారం బస్టాండ్ సమీపం లో శుక్రవారం రాత్రి బైక్ బర్రెలను ఢీకొని సిర్ర ప్రవీణ్ (25) అనే యువకుడు మృతిచెందగా పొన్నం అజ య్ పరిస్థితి విషమంగా ఉంది. జైపూర్ రెంజో ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్లకు చెందిన సిర్ర ప్రవీణ్, తిమ్మాపూర్‌కు చెందిన పొన్నం అజయ్ ద్విచక్రవాహనంపై మంచిర్యాలలోని బంధువుల ఇం టికి వెళ్లారు. అనంతరం స్వగ్రామానికి తిరిగి వస్తుం డగా అర్ధరాత్రి ఇందారం బస్టాండ్ సమీంపలో ద్విచక్రవాహనంతో బర్రెలను ఢీకొనడంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందగా పొన్నం అజయ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. అజయ్‌ను చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్క డ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతు డు ప్రవీణ్ తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి..

పెగడపల్లి, సెప్టెంబరు 28: మండలంలోని దీకొం డ గ్రామానికి చెందిన తాడూరు భూమయ్య (60) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం భూమయ్య తాను కౌలుకు సాగు చేస్తున్న భూమిలో వేసిన కంది పం టకు పందులు రాకుండా ఉండేందుకని ఈ నెల 10న రాత్రి చేను చుట్టూ వైరు అమర్చిదానికి విద్యు త్ కనెక్షన్ ఇచ్చాడు. 11న ఉదయం కరెంటు వైరు తొలగించేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్. రవికిరణ్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 28: కాల్వశ్రీరాం పూర్‌కు చెందిన చెప్పాల వినోద్ అనే యువకుడు పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయ త్నం చేసుకున్నాడు. గ్రామానికి చెందిన చెప్పాల వినోద్ తాను కొనుక్కున్న భూమిలో గోడ కడుతుం డగా, తన పెద్దమ్మ అయిన మొండెమ్మ భూమిలో తనకు వాటా వస్తుందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై వినోద్‌ను శనివారం ఎస్సై వెంకటేశ్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దీంతో వినోద్ మనస్థాపానికి గురై తన పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే వినోద్‌ను కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథ మ చికిత్స జరిపించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా కరీంనగర్‌కు తరలించారు.

వేర్వేరు సంఘటనల్లో ఆరుగురిపై కేసు నమోదు

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 28: జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు కారణాలతో ఆరుగు రిపై కేసు నమోదైనట్టు పట్టణ సీఐ వరంగంటి రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన ల్యాదల్ల మొగిలికి సంబంధించిన భూమిలోకి దామోదర్, చంద్రకళ, అజయ్‌లు ప్రవేశించి కనీలు తొలగించి, టేకు మొక్కలను ధ్వంసం చేయగా బాధితుడి ఫిర్యా దు మేరకు కేసు నమోదు అయింది.

● జమ్మికుంట మండలం గండ్రపల్లికి చెందిన పోల్సాని ఆశోక్‌రావుకు సంబంధించిన పొలంలో తన సోదరుడు వెంకటేశ్వర్‌రావు భూతగాదాలు మనసు లో పెట్టుకొని గడ్డి మందు చల్లడంతో నారు ఎండి పోయిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర్‌రావుపై కేసు నమోదైంది.

● **జమ్మికుంట:** జమ్మికుంట పట్టణంలోని మో త్కులగూడెంకు చెందిన దాసరి వృద్విపై ఇద్దరు వ్యక్తులు అకారణంగా దాడి చేసి కాలు విరగొట్టారని, బాధితుడి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు సన్ని, మధు అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

క్రైం కార్నర్

అనారోగ్య కారణాలతో దంపతుల ఆత్మహత్యాయత్నం

భర్త మృతి... భార్య పరిస్థితి విషమం



రమేశ్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 28: అనారోగ్య కారణాలతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో భార్యాభర్తలు ఆత్మహత్యకుయత్నించగా భర్త మృతి చెందాడు. భార్య పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల వివరాల ప్రకారం... శని వారం రాత్రి సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన పాలిస్టర్ వస్త్ర వ్యాపారి సామాల రమేశ్(52), లావణ్య(48) అనే భార్యాభర్తలు ఇంట్లోనే సోడియం నైట్రేట్ తాగారు. భర్త రమేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే స్థానికులు లావణ్య ను చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స అంది స్తున్నారు. సంఘటనా స్థలాన్ని టౌన్ ఎస్సై శ్రీనివాసరావు పరిశీలించారు. రమేశ్ 15 ఏళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్యం కారణంగానే భార్యభర్త లిద్దరు బలవన్మరణానికి ఒడిగట్టారు. ఈ దంపతులకు 11 ఏళ్ల కూతురు ఉంది.

డే కేర్ సెంటర్‌లో వృద్ధురాలి మృతి



పద్మావతి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 28: మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌లో వృద్ధాప్య సమస్యలతో వృద్ధు రాలు వేదాంతి పద్మావతి (87) శనివారం మృతి చెందిందని కేంద్రం కో-ఆర్డినేటర్ మమత తెలిపారు. గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన పద్మావతి ఐదుగురు కూతుళ్లు, కుమారుడికి వివాహాలు జరిపిం చింది. మలి దశలో ఆమె బాగోగులు చూసుకునే వారు లేకపోవడంతో బస్టాండు లో తలదాచుకుంటూ ఇబ్బందుల పాలైంది. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్ ఆమెను ఏడాది కిందట మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌లో చేర్పించారు. అప్పటి నుంచి నిర్వాహకులు ఆమెకు సప ర్యాలు చేశారు. వృద్ధాప్య సమస్య కారణంగా పరిస్థితి విషమించి శనివారం చనిపో యింది. దీంతో నిర్వాహకులు పద్మావతి మృతి వార్తను తూప్రాన్‌లో ఉంటున్న బంధువులకు సమాచారం అందించారు. పద్మావతి మృతదేహాన్ని డే కేర్ సెంట ర్‌లో ఫ్రీజర్‌లో భద్ర పరిచారు. బంధువుల రాక కోసం వేచి చూస్తున్నారు.

డెంగ్యూతో యువకుడి..

రుద్రంగి, సెప్టెంబరు 28: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన గుగ్గిళ్ల శ్రీనివాస్ (35)అనే యువకుడు డెంగ్యూతో శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన గుగ్గిళ్ల శ్రీనివాస్‌కు వారం రోజుల క్రితం జ్వరం రావడంతో ఓ ప్రైవేటు ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించుకున్నాడు. రిపోర్ట్‌లో డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు తేలింది. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలో ఆరోగ్యం విషమించడంతో శనివారం మృతి చెందాడు.

గోదావరిలో గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 28: గోదావరి నదిలో గురువారం గల్లంతైన సుదర్శి బాలరాజు కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బాలరాజు గల్లంతైన సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద గజ ఈతగాళ్లతో వెతికించారు. ప్రత్యేకంగా తెప్పించిన స్పీడ్ బోట్‌తో సుందిల్ల బ్యారేజీ వరకు నదిలో గాలించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో నీటి ప్రవాహంలో మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని పోలీసులు అంచనాకు వచ్చారు. గోదావరి పరివాహక పోలీస్ స్టేషన్‌లకు సమాచారం అందించామని, గుర్తు తెలియని మృత దేహం కనిపిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఖని ఏసీపీ మడక రమేష్ గాలింపు చర్యలను పర్యవేక్షించారు. ఈగాలింపు చర్యల్లో సీఐ ప్రసాదరావు, ఎస్సైలు వెంకటేశ్వర్, ఫరీద్, కానిస్టేబుల్స్ కృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, భార్గవ్, ఫైర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

జీవో నం.25ను సవరించి టీచర్ల సర్దుబాటు చేయాలి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 28: జీవో నం.25ను సవరించిన తర్వాతనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని యుఎస్పీసీ (ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ) డిమాండ్ చేసింది. శనివారం కలెక్టరేట్ ముందు యుఎస్పీసీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా రాష్ట్ర బాధ్యుడు వి.రాజిరెడ్డి మాట్లాడుతూ ఏ ఒక్క పాఠశాల మూసి వేయబోమని చెబుతూనే గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.25 ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం సరికాదని అన్నారు. ఈ జీవో ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు 18 సబ్జెక్టులను బోధించాల్సి ఉంటుందని అన్నారు. అదనంగా నాన్‌టీచింగ్ వర్క్, ఎఫ్ఆర్ఎస్‌లో విద్యార్థుల హాజరు నమోదు, మధ్యాహ్న భోజన వివరాలతో పాటు విద్యాశాఖ అడిగే సమాచారాన్ని ఎప్పటికప్పుడు నివేదికల రూపంలో అందించాల్సి ఉంటుందని అన్నారు. ఉన్నత పాఠశాలల్లో 220 సంఖ్య దాటితే అన్ని సబ్జెక్టులకు అదనంగా ఉపాధ్యాయులను ఇవ్వకుండా కేవలం గణితం టీచర్‌ను కేటాయిస్తారన్నారు. విద్యార్థుల సంఖ్య ప్రతి 30 మందికి ఒక సెక్షన్ పరిగణనలోకి తీసుకోకుండానే గంపగుత్తాగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులు నిర్ణయించడం కూడా అసం బద్ధంగా ఉందని అన్నారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడిని ఇవ్వాలని దశాబ్దాలుగా పోరాడుతున్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా జీవో 25ను అమలు చేయడం సరికాదన్నారు. ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించడం నాణ్యమైన విద్యకు విద్యార్థులను దూరం చేయడమేనని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో యుఎస్పీసీ రాష్ట్ర నాయకులు రాములు, ఎల్లయ్య, కోహెడ చంద్రమౌళి, బాలయ్య, జిల్లా ప్రతినిధులు కుమార్, దామోదర్‌రెడ్డి, నరహరి, జావేద్, చంద్రశేఖర్‌రావు, తూముల తిరుపతి, రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్, తిరుపతిగౌడ్, నర్సయ్య, నర్సింహరెడ్డి, శంకర్, సర్వర్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్ మృతి

తంగళ్లపల్లి, సెప్టెంబరు 28: విధుల్లో భాగంగా సిరిసిల్లలో సమావేశానికి వెళ్తుండగా అంగన్‌వాడీ టీచర్ గుండెపోటుతో మృతి చెందింది. తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ శంకరమ్మ శని వారం సిరిసిల్లలోని సమావేశానికి వెళ్తుండగా దారి మధ్యలో గుండెపోటుకు గురైంది. నేరెళ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స చేశారు. జిల్లా ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందింది. శంకరమ్మ మృతి విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి సంతాపం ప్రకటించారు. మృతురాలి కుటుంబానికి తక్షణ సహాయంగా ప్రభుత్వ పరంగా రూ.50 వేల చెక్కును డీడబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీరాజం అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదురుగాట్ల మమత, కోశాధికారి కొండికోప్పుల పద్మ, టీ హబ్ కోఆర్డినేటర్ రోజా, ప్రాజెక్టు అధికారి జ్యోతి, సూపర్ వైజర్ సుస్మిత, మాజీ ఎంపీటీసీ బైరినేని రాము, వెంకటేష్, రవి నివాళులర్పించారు.



కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న డీడబ్ల్యూవో లక్ష్మీరాజం

ఉమ్మడి జిల్లా అండర్-19 క్రీడల షెడ్యూల్ విడుదల

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28: ఉమ్మడి జిల్లా అండర్-19 ఎస్జీఎఫ్ జూనియర్ కళాశాలల క్రీడా పోటీల షెడ్యూల్‌ను జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, అండర్-19 ఎస్‌జీఎఫ్ అధ్య క్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, నిర్వహణ కార్యదర్శి జి మధు జాన్సన్‌లు విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనుటకు అర్హులు. ఈనెల 30వ తేదీన కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో బాలబాలికలకు రెజ్లింగ్ పోటీలను నిర్వహించనున్నారు. అక్టోబర్ 1న కరీంనగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని కొత్తపల్లి అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్లో హ్యాండ్‌బాల్ క్రీడలో బాల బాలికల విభాగంలో పోటీలను నిర్వహిస్తారు. కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్లో బాలబాలికల విభాగాలలో టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్, నెట్‌బాల్ పోటీల ఎంపికలను నిర్వహించనున్నారు. అక్టోబర్2న గోదావరిఖని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో బాలబాలికల విభాగాలలో వెయిట్ లిఫ్టింగ్, స్కేటింగ్, స్విమ్మింగ్, వాటర్ పోలో క్రీడాంశాలలో ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. అక్టోబర్ 4న జగిత్యాల క్లబ్‌లో కరాటే, షటిల్ బ్యాడ్మింటన్, టైక్వాండో క్రీడాంశాలలో బాల బాలికలకు పోటీలను నిర్వహిస్తారు. జగిత్యాల మినీ స్టేడియంలో బాలబాలికలకు బాస్కెట్‌బాల్, మార్షల్ ఆర్ట్స్, బాక్సింగ్ అంశాలలో పోటీలను నిర్వహిస్తారు. 5నజగిత్యాల మినీ స్టేడియంలో బాలబాలికలకు ఫెన్సింగ్, రగ్బీ, షూటింగ్, సెపక్ తక్రా, స్క్వాష్ క్రీడా అంశాలలో ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు.

అక్టోబరు 16న కరీంనగర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ జూనియర్ కళాశాలలో బాల బాలికలకు ఎంపికలను నిర్వహించనున్నారు. 17న కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ మైదానంలో బాలబాలికలకు కబడ్డీ పోటీలను నిర్వహిస్తారు. కరీంనగర్ భగత్‌నగర్‌లోని శ్రీకృష్ణ ఆర్చరీ అకాడమీలో బాలబాలికలకు ఆర్చరీ క్రీడాంశంలో పోటీలను నిర్వహిస్తారు. 18న శాతవాహన యూనివర్సిటీ కరీంనగర్ మైదానంలో సైక్లింగ్ రోడ్ అండ్ ట్రాక్, సాఫ్ట్‌బాల్, బేస్ బాల్ క్రీడాంశాల్లో బాల బాలికలకు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. 19న కరీంనగర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో బాల బాలికలకు అథ్లెటిక్స్, హాకీ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 21న కరీంనగర్ కొత్తపల్లి సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ మైదానంలో బాలబాలికలకు క్రికెట్ అంశంలో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 22న కరీంనగర్ కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో వాలీబాల్, బీచ్ వాలీబాల్, చెస్, జూడో ,యోగస్తాన్ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తారు. 23న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బాలబాలికలకు ఫుట్‌బాల్ క్రీడాంశంలో ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. 24న కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ మైదానంలో బాల బాలికలకు ఖోఖో క్రీడాంశంలో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 25వ తేదీన కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ మైదానంలో బాలబాలికలకు మోడ్రన్ పెంటథ్లాన్ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించనున్నారు. శాతవాహన యూనివర్సిటీ మైదానంలో బాలబాలికలకు 26న ఖురాశ్ క్రీడలో, 29న ఉషు క్రీడా అంశంలో ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలలో పాల్గొనుటకు జనవరి1, 2006 తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు కళాశాల యాజమాన్యం జారీ చేసిన ఐడెంటిటీ కార్డుతో ఎలిజిబిలిటీ ఫామ్‌తో హాజరుకావాలని వారు సూచించారు.

స్థానిక ఎన్నికల తుది ఓటర్లు జాబితా విడుదల

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 28: కరీంనగర్ మండలంలోని అన్ని గ్రామాల్లో స్థానిక ఎన్నికల ఓటరు తుది జాబితాను అధికారులు శనివారం విడుదల చేశారు. కరీంనగర్ మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా 170 వార్డులు ఉన్నాయి. ఇందులో మొత్తం 40,167 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 19,681 పురుష ఓటర్లు, 20,485 మహిళ ఓటర్లు, ట్రాన్స్ జండర్ ఒక్కరు ఉన్నారు. తుది జాబితాను ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీ వద్ద ప్రదర్శించారు. గత ఓటరు జాబితా కంటే 25 ఓటర్లు అధికంగా వచ్చాయి. తుది జాబితాలో కూడా మృతి చెందిన వారి పేర్లు నమోదయ్యాయి. అలాగే కొత్త ఓటర్లను చేర్చాలని ఫిర్యాదులు చేసినప్పటికి వారికి చోటు కల్పించలేదు. ఒకే కుటుంబం ఒకే వార్డులో చేర్చకుండానే తుది జాబితాను విడుదల చేశారు. అధికారులు మాత్రం 485 ఫిర్యాదులకు రాగా వాటిని పరిష్కరించాని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి భాధ్యత

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 28: పరిసరాల పరిశుభ్రతపై అందరి బాధ్యతగా ఉండాలని హమ్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ విద్యార్థులకు సూచించారు. శనివారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు కొండ కింది వేణుగోపాల్‌శర్మ, రమణ, రవికుమార్, ప్రధానో పాధ్యాయురాలు పద్మజ పాల్గొన్నారు.

'భాషా నైపుణ్యాలను మెరుగుపర్చాలి'

భగత్‌నగర్, సెప్టెంబరు 28: విద్యార్థుల తెలుగు భాషా నైపుణ్యాలను మెరుగుపర్చాలని డీఈవో జనార్దన్‌రావు అన్నారు. శనివారం కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు భాషలో పట్టు సాధించనప్పుడే అభ్యసన ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా మేయర్ జన్మదిన వేడుకలు



క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 28: నగరంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. భగత్‌నగర్‌లోని శ్రీహరిహరక్షేత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో మేయర్ సునీల్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆయనను ఆశీర్వదించారు. క్యాంపు కార్యాలయంలో మేయర్‌ను కార్యాలయ సిబ్బంది సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేయించి కేక్, స్వీట్లను పంపిణీ చేశారు. భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, భగత్‌నగర్ చైతన్య యూత్, టీఎన్‌జీవోస్ ఉద్యోగసంఘాలు, తెలంగాణ చౌక్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు ఉయ్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బర్త్‌డే కేక్‌లను సునీల్‌రావు కట్ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో పాలకవర్గసభ్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఆదర్శ యూత్ క్లబ్ సభ్యులు విద్యాసాగర్, నరేందర్ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి అన్నదాన కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. పెద్దమ్మ యూత్, జైభూన్ యూత్ క్లబ్ సభ్యులు అనిల్, హమీద్ ఆధ్వర్యంలో భగత్‌నగర్‌లో ఆహార పొట్లాలను పంపిణీ చేశారు.

● మేయర్ సునీల్‌రావును కమిషనర్ చాహత్ భాజ్‌పాయి, అదనపు కమిషనర్ సువార్త కలిసి పూలమొక్కలను బహూకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వివేకానందలో టాస్క్‌పై ముగిసిన శిక్షణ

గణేశ్‌నగర్, సెప్టెంబరు 28: నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్‌స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిఎచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి డిబిఎంఎస్‌పై అవగాహన కల్గి ఉన్నట్లైతే సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఉద్యోగం సంపాదించడం సులువని పేర్కొన్నారు. కార్యక్రమంలో టాస్క్ ట్రైనర్ బోడ్ల స్వప్న, టి.పి.ఓ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ సలీం పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 28: నగరంలోని యజ్ఞవరాహ క్షేత్రంలో అక్టోబరు3 నుంచి 12వరకు అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు సర్వవైదిక సంస్థానంట్రస్టు ఉప కులపతి శ్రీభాష్యం వరప్రసాద్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

మున్సిపాలిటీలో ఇష్టానుసారంగా నిధుల ఖర్చు?

హుజూరాబాద్, సెప్టెంబరు 28: హుజూరాబాద్ మున్సిపాలిటీలో ఇష్టానుసారంగా నిధులు ఖర్చులు చేస్తున్నారనే విమర్శలు వినబడుతున్నాయి. దీనికి సంబంధిత అధికారులు వత్తాస్ పలుకుతున్నారు. 20 రోజుల క్రితం గణేష్ నిమజ్జనం ఏర్పాట్ల కోసం రూ. 8.50లక్షలు పాలకవర్గం ప్రతిపాదన చేశారు. అందుకు తగ్గట్టుగా నిమజ్జన ఏర్పాట్లు చేయలేదని పట్టణ ప్రజలు పెదవి విరుస్తున్నారు. వాస్తవానికి హుజూరాబాద్ పట్టణంతో పాటు విలీనమైన గ్రామాల్లో సుమారు 90శాతం వరకు ఉపఎన్నికల సమయంలో సీసీ రోడ్లు పూర్తి చేశారు. కేవలం అంబేద్కర్ చౌరస్తాలో స్టేజీ, ఎస్సారెస్పీ కెనాల్ వద్ద క్రేన్ ఏర్పాటు, విద్యుత్ అలంకరణ తప్పా ఎలాంటి పనులు చేయలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ నిధులను డ్రా చేసేందుకు మున్సిపాలిటీలోని కొంత మంది తప్పుడు బిల్లులను సృష్టిస్తున్నారని తెలిసింది. ఈ నిధుల విషయంపై కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ఫిర్యాదు చేసిన ట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సొల్లు బాబు తెలిపారు. దీని పై విచారణ జరపాలని మున్సిపల్ సీడీఎంఏకు ఆదేశాలు జారీ చేశారన్నారు. మున్సిపాలి టీలో ఐదేళ్లుగా జరిగిన నిధుల ఖర్చులపై విచారణ జరపాలని సొల్లు బాబు డిమాండ్ చేశారు.

లోక్ అదాలత్‌ల ద్వారా కేసుల సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి బి.ప్రతిమ

కరీంనగర్ లీగల్, సెప్టెంబరు 28: లోక్ అదాలత్‌లతో కేసులను రాజీ ద్వారా సత్వరంగా పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి బి.ప్రతిమ అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్‌లో లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. లోకదాలత్‌లలో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌కు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ లోక్‌అదాలత్‌లో పోలీస్ అధికారులు ఎక్కువ సంఖ్యల కేసుల పరిష్కారానికి కృషి చేశారని అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లకు న్యాయవాదుల పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి వెంకటేష్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లు, వాటి పనితీరుపై వివరించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లలో 5,362 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. వీటిలో 5263 క్రిమినల్ కేసులు, 99 సివిల్ కేసులు ఉన్నాయన్నారు. 83 మోటారు ప్రమాద పరిహారం కేసులు పరిష్కరించగా వాటిలో బాధితులకు 3.79కోట్ల రూపాయలను ఇన్సూరెన్స్ కంపెనీలు పరిహారంగా పరిహారంగా ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిపారు. కేసుల పరిష్కారంలో జిల్లాకు 12వ ర్యాంకు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు వెంకటేష్, సాధన, కుమార్ వివేక్, నీరజ, లక్ష్మీకుమారి, శ్రీలేఖ, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు గౌరు రాజిరెడ్డి, జూలూరు శ్రీరాములు, గడ్డం లక్ష్మణ్, వీరస్వామి, రంజిత్, ఏసీపీలు నరేందర్, విజయ్‌కుమార్, సీఐలు విజయ్‌కుమార్, స్వామి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

భగత్‌నగర్, సెప్టెంబరు 28: భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని శనివారం భగత్‌నగర్‌లో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా యుఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంద గణేష్ మాట్లాడుతూ భగత్‌సింగ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో జిల్లా కమిటీ సభ్యులు గణేష్, అభిలాష్, సాయికుమార్, అభికుమార్, సందీప్, సంతోష్ పాల్గొన్నారు.

● భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చరమేష్‌లు డిమాండ్ చేశారు. భగత్‌నగర్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు.

గౌరవెల్లి రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 28: శ్రీరాంసాగర్ వరద కాలువ, గౌరవెల్లి రిజర్వాయర్ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నత్తనడక సాగుతున్న వరద కాలువ పనులను యుద్ధ ప్రాతిపదికన నిధులు విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన మంత్రి నిధుల మంజూరుకు అధికారులను ఆదేశించారన్నారు.

ఘనంగా జాషువా జయంతి

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 28: నగరంలోని బైపాస్‌రోడ్‌లోని ఓ బాంకెట్ హాల్‌లో శనివారం తెలంగాణ సాహితి, ఆసంపల్లి లక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాషువా 129వ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ మాట్లాడుతూ జాషువా ప్రజాస్వామ్యం కోసం తన కవిత్వాన్ని ఆయుధంగా వాడారని అన్నారు. అనంతరం కవులను సన్మానించారు. కార్యక్రమంలో ఆసంపల్లి లక్ష్మీ ఫౌండేషన్ చైర్మన్ ఆసంపల్లి శ్రీనివాస్, తెలంగాణ సాహితి రాష్ట్ర కార్యదర్శి రాములు, జిల్లా కార్యదర్శి మానువాడ శంకర్ పాల్గొన్నారు.

● జ్యోతిబాపూలే మైదానంలో తెరవే ఆధ్వర్యంలో జాషువా జయంతి నిర్వహించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వేంకటేశ్వర్లు మాట్లాడుతూ దుఃఖితుల, పీడితుల వేదనను జాషువా అక్షరీకరించారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీవి కుమార్, ప్రధాన కార్యదర్శి దామరకుంట శంకరయ్య, నడిమెట్ల రామయ్య, విలాసాగరం రవీందర్ పాల్గొన్నారు.

వలస కూలీలకు అల్పాహారం వితరణ

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 28: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో బొమ్మకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కోల లావణ్య-అన్నారెడ్డి కుమారుడు కోల ఆదిత్య జయంతి సందర్భంగా వలస కూలీలకు అల్పాహారం వితరణ చేశారు. కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, జోన్ చైర్‌పర్సన్ లయన్ చింతల కిషన్‌పటేల్, క్లబ్ సెక్రెటరీ రాజేందర్ ఉన్నారు.

'బీసీ సంక్షేమ హాస్టళ్లను పెంచాలి'



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 28: నగరంలో ఉన్నటువంటి పోస్ట్ మెట్రిక్ హాస్టళ్ల సంఖ్యను పెంచుతూ విద్యార్థులకు ఎక్కువ సీట్లను కేటాయించాలని కోరుతూ కలెక్టర్‌కు బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఉన్నటువంటి బీసీ సంక్షేమ కళాశాల హాస్టల్ మూడు గర్ల్స్ నాలుగు హాస్టల్లో విద్యార్థులకు సీట్లు సరిపోవడం లేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది అన్నారు. విద్యార్థులు సీట్లు దొరకక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంబీఏ, ఎంసీఏ,ఇంజనీరింగ్ ,వివిధ కోర్సులు చదివే విద్యార్థిని, విద్యార్థులకు సరిపడా సీట్లు అందుబాటులో లేకపోవడం వల్ల వివిధ గ్రామాల నుండి వస్తూ, పోవడం ప్రైవేట్ హాస్టల్లో డబ్బులు పెట్టి ఉంటూ తల్లిదండ్రులపై భారం పడుతుందన్నారు. పక్కా భవనాలను నిర్మించాలని కోరామన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షులు చిగుర్ల శ్రీనివాస్,యువజన సంఘం ఉపాధ్యక్షులు నల్లగొని శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఉమ మహేశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 28: అధ్యాపకులు విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండాలని కళాశాలల ఉన్నత విద్య కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రసింగ్ సూచించారు. శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను కళాశాలల ఉన్నత విద్య కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కళాశాల ఉన్నత విద్యా కమిషనర్ దేవసేన పర్యవేక్షణలో ఉన్నత విద్య నేడు ప్రగతి పథం వైపు పయనిస్తుందని అన్నారు. డిగ్రీ కళాశాలలో పనిచేసే అసిస్టెంట్ ,అసోసియేట్ ప్రొఫెసర్లు అందరూ నిత్య విద్యార్థిగా ఉంటూ విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్ళే ప్రయత్నం చేయాలని కోరారు. ఉన్నత విద్య గురించి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రవేశపెడుతున్న పథకాల్లో భాగస్వాములుగా మారి విద్యార్థులకు మార్గదర్శనం చేసి ప్రభుత్వ కళాశాలలను ప్రగతి పథం వైపు తీసుకెళ్తున్న అధ్యాపకులను అందరినీ ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై సత్యనారాయణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్స్, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి జూడో పోటీల్లో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28: జిల్లా జూడో క్రీడాకారులు జాతీయస్థాయి జూడో పోటీల్లో విజేతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ జూడో పోటీల్లో కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల విద్యార్థులు 6గురు పాల్గొని 6 స్వర్ణ పతకాలను సాధించారు. క్రీడాకారులు బి యశ్వంతిక, డి వర్షిత, ఎ సుష్మిత, యు శివసాయి, టి హర్షిత్‌రెడ్డి, ఆర్ కార్తిక్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా శనివారం క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీవైఎస్‌వో వి శ్రీనివాస్, కోచ్ కె శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే సహకార సంఘాల లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

సైదాపూర్, సెప్టెంబరు 28: సంఘం పరిధిలోని రైతుల అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం పనిచేస్తోందని సింగిల్ విండో అధ్యక్షుడు బిల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అర్ధ వార్షిక మహాసభ సంఘం ఆవరణలో అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఈవో చెల్మెల మల్లారెడ్డి సంఘం లావాదేవీలను చదివి వినిపించారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం పరిధిలోని రైతులకు ఉపయోగపడే విధంగా అన్ని కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గుండేటి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్, మాజీ సర్పంచ్ ఆవునూరి పాపయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

చిగురుమామిడి: రైతులకు సుమారు రూ.11కోట్ల 50లక్షల రుణాలు అందించామని చిగురుమామిడి సహకార సంఘం సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.11.50కోట్ల స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల రూపంలో అందించామని తెలిపారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు కరివెద మహేందర్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ వనజ, సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

మానకొండూర్: రైతుల సహకారంతోనే సంఘాలు అభివృద్ధి చెందుతాయని ఊటూర్, గట్టుదుద్దెనపల్లి సహకార సంఘాల అధ్యక్షులు ముద్దసాని ప్రదీప్‌రెడ్డి, అనభేరి రాధాకిషన్‌రావు అన్నారు. రెండు గ్రామాల్లోని సహకార సంఘాల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఊటూర్ సహకార సంఘంలో అయిదు కోట్ల డిపాజిట్లు ఉన్నాయని తెలిపారు. గట్టుదుద్దెనపల్లిలో సహకార సంఘంలోని గత పాలకవర్గంలో జరిగిన తప్పిదాలపై రైతులు నిలదీశారు. జాతీయ రహదారి నిర్మాణంలో తొలగించిన ప్రధాన కార్యాలయం నూతన భవనాన్ని నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఆయా సంఘాల ఉపాధ్యక్షులు ఎడ్ల సతీష్, కర్ర అనంతరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

భూ విరాళ దాతను అభినందించిన ఎమ్మెల్యే

రామడుగు, సెప్టెంబరు 28: మండలంలోని గోలి రామయ్యపల్లె గ్రామానికి చెందిన నునుకొండ రామవ్వ-లక్ష్మయ్య దంపతులు తమ చిన్న కుమారుడు నునుగొండ ప్రభాకర్ జ్ఞాపకార్థం ఎకరం ఆరు గుంటల భూమిని గ్రామపంచాయతీకి విరాళంగా అందించారు. ఈ మేరకు చొప్పదండి ఎమ్మెల్యే సత్యం శనివారం వారిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఉప్పుల అంజనీప్రసాద్, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, ఎంపీవో శ్రావణ్‌కుమార్, కార్యదర్శి అక్షిత తదితరులు ఉన్నారు.

'రాంలీలా నిర్వహణకు రూ. కోటి వసూలు'



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్, సెప్టెంబరు 28: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఎల్‌ఎండి కాలనీలో నిర్వహించే రాంలీలా కార్యక్రమ నిర్వహణ కోసం కోటి రూపాయాలు టార్గెట్ పెట్టుకొని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వసూలు చేస్తున్నారని మాజి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో మీడియా సమావేశంలో రసమయి మాట్లాడారు. గతంలో రాంలీలా కార్యక్రమాన్ని ఒక కమిటీని వేసుకొని తాము సొంత ఖర్చులతో నిర్వహించామన్నారు. ఇప్పుడు నిర్వహణ కోసం కోటి రూపాయల లక్ష్యంతో వసూళ్లకు పాల్పడేది నిజమా, కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఇనుకొండ జితేందర్ రెడ్డి, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సింగిల్ విండో అధ్యక్షుడు

సైదాపూర్, సెప్టెంబరు 28: మండలంలోని వెన్కేపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం రాత్రి చేరారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ తిరుపతిరెడ్డికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, ఎక్లాస్‌పూర్ గ్రామశాఖ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నాయకులు రాఘవులు, రాజు, శ్రీనివాస్, దస్తగిరి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



గర్భిణులు, మహిళలతో ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, సెప్టెంబరు 28: ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళలు ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. పోషణ మాసోత్సవం కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల మహిళా ప్రాంగణ ఆవరణలో నిర్వహించిన సభకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ మంగళ, గురువారా ల్లో ఆరోగ్య మహిళ పరీక్షలు ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. మహిళలు ఆరోగ్య పరీక్షలు ప్రభుత్వ అసుపత్రిలోనే ఉచితంగా చేయించుకోవాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ అసు పత్రిలో డెలివరీలు చేయించుకోవాలని సూచిం చారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి, మండల వైద్యాధికారి ప్రణవ్, సీడీపీవో శ్రీమతి, తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో విజయ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అధికారులే పూర్తి బాధ్యత తీసుకోవాలి

తిమ్మాపూర్: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా అధికారులే పూర్తి బాధ్యత తీసుకొని గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో మానకొండూర్ నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో మహిళలు బతుకమ్మ ఆడుకునే స్థలంలో పారిశుధ్య పనులు చేపట్టాలని, లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

కమిషనర్‌పై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

కరీంనగర్‌టౌన్, సెప్టెంబరు 28: కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్‌పై కాంగ్రెస్ నాయకుడు మెండి చంద్రశేఖర్ (మార్షల్) ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. మహిళా కార్పొరేటర్ మెండి శ్రీలత భర్త చంద్రశేఖర్ మార్షల్ తీగలగుట్టపల్లిలో జరుగుతున్న అక్రమ నిర్మాణంపై మాట్లాడేందుకు వెళితే తనను మున్సిపల్ కమిషనర్ గెటౌట్ అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపారని, ఈ వివాదంపై విచారణ జరిపించి ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

సెయింట్‌జార్జ్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

భగత్‌నగర్, సెప్టెంబరు 28: పోలీసుల విధులు విద్యార్థులకు తెలియాల్సిన అవసరం ఉందని సెయింట్‌జార్జ్ నినోస్ బ్లాక్ (సిబిఎస్‌ఈ) పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్‌లోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను క్షేత్ర పర్యటనలో భాగంగా వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను విద్యా ప్రణాళికలో భాగంగా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించడం జరిగిందన్నారు. విద్యార్థులు అనుభవ పూర్వకమైన అభ్యాసం వల్ల కొత్త విషయాలు నేర్చుకుంటారన్నారు. ఇలాంటి క్షేత్రపర్యటనలకు విద్యార్థులను తీసుకు వెళ్లిన ఇన్‌చార్జి సంగీతను అభినందించారు.

బ్లూబెల్స్ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు28: నగరంలోని కోతిరాంపూర్‌కు చెందిన ఎల్‌షోరూం వారు నిర్వహించిన పలు పోటీల్లో హనుమాన్‌నగర్‌కు చెందిన బ్లూబెల్స్ హైస్కూల్ చిన్నారులు 60 మంది విద్యార్థులు పాల్గొనగా పలువురు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. డ్రాయింగ్‌లో ఏ అర్జున్, ఎం వైష్ణవి, ఎం నిత్యక్షిన్య, భరతనాట్యంలో కె హాత్రిని, ఆర్ మనోజ్ఞ, కె వర్షిణి, పాటల పోటీల్లో ఏ అద్విత, పి త్రినాథ్, పి లాస్య, పేయింటింగ్‌లో ఎస్ మోక్షక్, బి సాయి సుహాన్, ఎస్ అశ్వంత్ విజేతలుగా నిలిచారు. విద్యార్థులను శనివారం ప్రిన్సిపల్ జంగ సునీతామనోహర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 28: కరీంనగర్ మండలంలో బొమ్మకల్ గ్రామంలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సంస్థ చైర్మన్ పి.కేశవరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి పురమల్ల శ్రీనివాస్, యంసి మెంబర్ కోల అన్నారెడ్డి, మెడికల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ రెడ్డి, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి బతుకమ్మ పండగ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 28: తెలంగాణ సంస్కృతి బతుకమ్మ పండగ అని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో కెఎస్‌ఆర్ ప్రొడక్షన్‌లో రూపొందించిన పండగ వచ్చే చెల్లెలా అనే పాటను ఆర్‌డీవో మహేశ్వర్, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజక వర్గ ఇంచార్జీ పురమల్ల శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు.

భానుప్రకాశ్‌కు పురస్కారం అందజేత

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 28: నగరంలో శనివారం వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో సమైక్య సాహితి ఆధ్వర్యంలో మెదక్‌కు చెందిన కవి, అవధాని, ప్రభుత్వ పాఠ్య పుస్తకాల రచయిత అవుసుల భానుప్రకాశ్‌కు కరీంనగర్‌కు చెందిన పద్య కవి కల్వకుంట రఘునాథాచార్య స్మారక సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 5116 రూపాయల నగదు, శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంను పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో కాంచనపల్లి గోవర్ధన్‌రాజు, జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ సముద్రాల రామానుజాచార్యులు, సంస్థ అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్, ప్రధాన కార్యదర్శి కెఎస్ అనంతాచార్య, పురస్కార ప్రదాత కల్వకుంట మోహనకృష్ణ పాల్గొన్నారు.

అచీవర్స్‌లో కలర్స్ డే

కరీంనగర్‌టౌన్, సెప్టెంబరు28: నగరంలోని కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో వండర్స్ ఆఫ్ కలర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు విద్యార్థులకు రంగులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పల్లవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

● హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఏసీపీ శ్రీనివాస్‌జీ హాజరై మాట్లాడారు. అనంతరం యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ పోస్టర్‌ను టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు.

- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హుజూరాబాద్ పట్టణంలో ప్రముఖ రచయిత్రి విజయభారతి చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

● చొప్పదండి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పోలీస్ అమరుల త్యాగాలు' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ ప్రకాష్ గౌడ్, ఎస్సై గొల్లపల్లి అనూష ప్రిన్సిపల్ ఎల్ స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

● గంగాధర: గ్రామంలో రోడ్డు నిర్మించాలని బొమ్మకంటిపల్లె గ్రామస్థులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కరీంనగర్‌లో వినతిపత్రం అందజేశారు.

- దుర్గాదేవి నవరాత్రి ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఎస్ఐ నరేందర్‌రెడ్డి సూచించారు. మండలంలో దేవి విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

● తిమ్మాపూర్: మండలంఒని అలుగునూర్ సబ్ స్టేషన్ పరిధిలో అదివారం ఉదయం 8గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సబ్ స్టేషన్ ఏఈ వెంకటరమణ తెలిపారు.

● మానకొండూర్: మండలంలోని అన్నారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అధికారులు బూట్లు, సాక్సులు పంపిణీ చేశారు.

● గన్నేరువరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 253 మంది విద్యార్థులకు షూలు, మూడు జతల సాక్స్‌లను ఎంఈవో కె రామయ్య అందజేశారు.

- మండలంలోని 17 గ్రామాల ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. 140 వార్డులకు గాను పురుషులు 8,841, మహిళలు 9,202 కాగా మొత్తం ఓటర్ల సంఖ్య 18,043 ఉన్నట్లు మండలపంచాయతీ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

● జమ్మికుంట: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంపు నిర్వహించారు.

- జమ్మికుంట పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) మాజీ ప్రధాన కార్యదర్శి ముద్దసాని సత్యనారాయణరెడ్డి ఆనారోగ్యంతో శనివారం మృతిచెందాడు.

● శంకరపట్నం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

● సైదాపూర్: మండల కేంద్రంలో 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏఈ బొమ్మ ఆంజనేయులు ఏర్పాటు చేశారు.

● వీణవంక: మండల కేంద్రానికి చెందిన తోట్ల సరోజన భర్త రాజకొంరయ్య మద్యం తాగి వచ్చి తిడుతున్నాడని ఇంటిలో ఎవరికి చెప్పకుండా గురువారం బయటకు వెళ్లింది. సరోజన కూమారుడు రాజు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.